సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 2 । డిసెంబర్ । 2023



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి బొచ్చు నాగేంద్ర గుప్తా, పుష్పావతి దంపతులు(పెనుగొండ మండలం) శుక్రవారం రూ 1,01,116 విరాళం అందజేశారు.




ప్రతిభకు ప్రోత్సాహం

ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలు అందిస్తోంది.

8లో

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి శుక్రవారం డెల్టా కాలువలకు 3,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,300,మధ్య డెల్టాకు 600,పశ్చిమ డెల్టాకు 2,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జోరుగా పింఛన్ల పంపిణీ

తొలి రోజే 81.86 శాతం

సాక్షి అమలాపురం: జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. శుక్రవారం తెల్లవారు జామున మొదలైన పింఛన్ల పంపిణీ రాత్రి వరకు నిర్విఘ్నంగా సాగింది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులలో చాలా మందికి తెల్లవార కుండానే పింఛన్లు అందించారు. వలంటీర్లు ఉషోదయనే పింఛన్లు అందజేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో సాయంత్రం ఆరు గంటల సమయానికే ఏకంగా 81.86 శాతం పింఛన్లు పంపిణీ చేయడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా మొత్తం అన్ని రకాల పింఛన్లు కలిపి 2,44,463 వరకు ఉండగా, సాయంత్రం ఆరు గంటల కల్లా 2,00,128 మందికి అందజేశారు. ఆ తరువాతా పింఛన్ల పంపిణీ కొనసాగింది. మొత్తం రూ.66,19,99,250 నగదును అందించాల్సి ఉండగా, రూ.54,16,67,000 అందజేయడం గమనార్హం. జిల్లాలో ముమ్మిడివరం అర్బన్ అత్యధికంగా 87.7 శాతం అందించి తొలి స్థానంలో ఉంది. ఇక్కడ 3,089 పింఛన్లకు గాను, 2,709 అందించారు. ఆ తరువాత స్థానాలలో రాజోలులో 9,703కు గాను, 8,463 మందికి (87.22), ముమ్మిడివరం మండలం 7,005కు గాను, 6,068 మందికి (86.62) అందించారు. అల్లవరం, సఖినేటిపల్లి, రాయవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో 85 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. అతి తక్కువగా కె.గంగవరం మండలంలో 71.42 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.

తుపాను వేళ అప్రమత్తత ముఖ్యం

కంట్రోల్ రూం నంబర్లు
1800 425 2532 (టోల్ ఫ్రీ)
08856 293104

అమలాపురం రూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ఆయన శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఆగ్నేయ నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని తెలిపారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ శనివారం నాటికి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆదివారం నాటికి నైరుతి బంగాళాఖాతంపై తుపానుగా మారే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత వాయవ్య దిశగా కదులుతూ, డిసెంబర్ 4వ తేదీ సాయంత్రానికి చెన్నై – మచిలీపట్నం మధ్య దక్షిణ ఆంధ్రప్రదేశ్‌ను ఆనుకుని ఉన్న ఉత్తర తమిళనాడు తీరాన్ని తుపాను దాటే అవకాశం ఉందన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు ఈ నెల 5వ తేదీ వరకు సముద్రంలో చేపలు వేటకు వెళ్లరాదని ఆయన స్పష్టం చేశారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. డిసెంబర్ 5వ తేదీన ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 4వ తేదీ సాయంత్రం నుంచి గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 5వ తేదీ సాయంత్రం నుంచి క్రమంగా గాలుల తీవ్రత తగ్గుతుందన్నారు. సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి చేరుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచనలను జారీ చేసినట్టు పేర్కొన్నారు.

పేదల గూడుకు ఉపాధి చేదోడు



మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లిలో వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



అమలాపురం మండలం నల్లమిల్లి అంబటివారిపాలెం వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

- కోనసీమలో జోరుగా నిర్మాణాలు
- 90 రోజుల పని కల్పన
- ఇంటికి రూ.24 వేలకు పైగా సాయం
- వేతనాల రూపంలో రూ.13.80 కోట్లు ఖర్చు

సాక్షి అమలాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' పథకానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చేయూతనిస్తోంది. ఇళ్ల నిర్మాణాలకు ఉపాధి హామీ పథకంలో 90 రోజుల పని దినాలకు మస్తరు వేస్తున్నారు. ఇందుకు సంబంధించి కూలి దినాల సొమ్మును లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఈ సొమ్ము పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తోంది.

లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ

జిల్లాలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లోనూ, వ్యక్తిగతంగా ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పేదలందరికీ ఇళ్ల నిర్మాణంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 9,780 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి. ప్రభుత్వం ఇస్తున్న నిధులకు అదనంగా ఉపాధి హామీ పథకం ద్వారా కూడా నిధులు అందజేస్తున్నారు. ఒక్కొక్క ఇంటికీ 90 పనిదినాల చొప్పున కేటాయించి ఇందుకు అయ్యే కూలి ఖర్చును లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారు. 2021–22 నుంచి ఈ ఏడాది వరకు ఆయా ఏడాది ఉన్న పని దినాల సొమ్మును లబ్ధిదారులకు అందజేస్తున్నారు. 2021–22లో రోజుకు రూ.245 చొప్పున, 2022–23లో రోజుకు రూ.257 చొప్పున, 2023–24 ఏడాది కాలానికి రోజుకు రూ.272 చొప్పున రోజువారీ పనిదినాల సొమ్ము కేటాయించారు. ఇళ్ల నిర్మాణాలకు మొత్తం నాలుగు దశలో 90 రోజుల పని దినాల కేటాయిస్తున్నారు. దీనిలో పునాది సమయంలో 28 రోజులు, లింటల్ ఎత్తుకు 24 రోజులు, రూఫ్ లెవెల్‌కి 10 రోజులు, నిర్మాణం పూర్తయితే మరో 28 రోజులు చొప్పున గుర్తిస్తున్నారు.

వివరాలు ఇలా..

మండలం	కేటాయించిన పనులు	ప్రారంభించిన పనులు	పూర్తయిన పనులు	మొత్తం పని దినాలు	కేటాయించిన నిధులు (రూ.లలో)
ఆలమూరు	283	152	85	17,452	43,45,235
అల్లవరం	289	162	23	10,944	28,25,388
అమలాపురం	561	318	129	26,275	67,24,130
ఆత్రేయపురం	430	148	232	30,202	76,50,950
ఐ.పోలవరం	502	228	175	27,588	70,12,803
కె.గంగవరం	670	325	156	28,987	74,23,784
కపిలేశ్వరపురం	791	319	316	44,281	1,12,44,695
మామిడికుదురు	132	67	53	8,260	20,82,503
మండపేట	2,946	1,781	591	1,22,032	3,11,51,441
ముమ్మిడివరం	273	162	62	16,184	41,61,283
రామచంద్రపురం	1,366	581	483	68,629	1,73,76,503
రావులపాలెం	589	224	263	36,376	91,94,669
రాయవరం	1,081	555	460	61,816	1,56,46,109
రాజోలు	643	236	310	39,073	1,00,23,164
ఉప్పలగుప్తం	181	29	37	4,524	11,52,996
మొత్తం	10,737	5,287	3,375	5,42,623	13,80,15,653

వేగంగా చెల్లింపు



ఇళ్ల నిర్మాణాలకు ఉపాధి హామీ పథకంలో 90 రోజుల పని దినాలకు మస్తరు వేస్తున్నాం. వారికి ఉపాధి రోజువారీ వేతనాన్ని అందజేస్తున్నాం. ఈ చెల్లింపుల ప్రక్రియ జిల్లాలో వేగంగా సాగుతోంది. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా అండగా నిలుస్తోంది.

– వి.మధుసూదనరావు, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ

ప్రభుత్వ చేయూతతో సొంత ఇల్లు



ప్రభుత్వం అందించిన సహకారంతో నాకు సొంత ఇల్లు కల నెరవేరింది. ప్రతి దశలో ఇవ్వాల్సిన సొమ్ము మా ఖాతాలో వేశారు. దీని వల్లే అనుకున్న సమయానికి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. ఈ విషయంలో ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

– పెరవలి కొండమ్మ, కట్టుంగ, ఆత్రేయపురం మండలం

15 మండలాలకు మంజూరు

- జిల్లాలో 22 మండలాలకు గాను 15 మండలాల్లో గృహ నిర్మాణాలకు ఉపాధి నిధుల కేటాయింపు జరిగింది. కొత్తపేట, కాట్రేనికోన, అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో కేటాయింపులు చేయలేదు. 15 మండలాలకు గాను ఇప్పటి వరకు 10,737 పనులు మంజూరయ్యాయి. వీటిలో 5,287 పనులు మొదలు కాగా, 3,375 పనులు పూర్తయ్యాయి. ఇంకా 1,912 పనులు వివిధ దశలలో ఉన్నాయి. పూర్తయిన పనులకు సంబంధించి 5,42,623 పని దినాలు కాగా, వీటికి సంబంధించి లబ్ధిదారుల ఖాతాలలో రూ.13,80,15,653 జమ చేశారు.
- గృహ నిర్మాణ శాఖ ద్వారా జిల్లా నీటి యాజమాన్య సంస్థకు లబ్ధిదారులు జాబితా అందుతోంది. గ్రామాల వారీగా అందే జాబితాను బట్టి ఉపాధి సిబ్బంది తొలుత అంచనాలు రూపొందిస్తున్నారు. వీరిలో ఇళ్ల నిర్మాణం చేపట్టినవారికి నిర్మాణ దశలను బట్టి సొమ్ము చెల్లిస్తున్నారు. ఈ ఏడాది ఉపాధి చెల్లింపును పరిగణలోకి తీసుకుంటే ఒక్కొక్క లబ్ధిదారునికి 90 పనిదినాలకు గాను రూ.24,480 వరకు లబ్ధి చేకూరుతోంది.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ ఖాదర్‌భాషా

అమలాపురం రూరల్: విద్యార్థి దశలో యువత మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు అవ్వకుండా ఉండాలని ఏఎస్పీ ఖాదర్ భాషా అన్నారు. మాదక ద్రవ్యాల రవాణా నిరోధం, మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే దుష్పరిణామాలపై అమలాపురం ఆర్టీసీ డిపోలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. వివిధ డిపోల నుంచిహాజరైన ఆర్టీసీ ఉద్యోగులు, లాగి స్టిక్స్ కౌంటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు. ఏఎస్పీ ఖాదర్, డీఎస్పీ అంబికా ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా జరగకుండా నిరోధించడానికి సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. విద్యార్థి దశలో యువత మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు అవ్వకుండా ఉండాలని, వాటి వలన వచ్చే దుష్పరిణామాలను వివరించారు. ఏఆర్ డీఎస్పీ విజయ సారథి, ఎస్ఈబీ డీఎస్పీగంగాధర్, సీఐలు క్రాంతికుమార్, శివరామరాజు మాధవ్, ఎస్సై ప్రభాకరరావు, డీఎం చల్లా సత్యనారాయణమూర్తి, ట్రాఫిక్ సీఐ ప్రతిమాకుమార్, గ్యారేజ్ ఇన్‌చార్జి జీఆర్ఎల్ దేవిపాల్గొన్నారు.

గురుకులం పరిశీలన

అల్లవరం: గోడిలోని బాలుర గురుకులాన్ని గురుకుల పాఠశాలల స్టేట్ సెక్రటరీ ఆర్.మహేష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల, విద్యార్థుల డార్మెటరీ, మరుగుదొడ్లను పరిశీలించారు. బాలుర గురుకులంలోని మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.84 లక్షలు ఇటీవల మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో గురుకులంలో చేపట్టిన పనుల ప్రగతిపై అధికారులతో మాట్లాడారు. గురుకులంలో ఇంకా ఏమైనా అవసరాలు ఉంటే గుర్తించి ప్రతిపాదనలు చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. గడువు లోగా పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట డీసీఓ రాజకుమారి, పీఆర్ ఈఈ చంటిబాబు, డీఈ రాజ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ డీఈ సుబ్బరాజు, ప్రిన్సిపాల్ శ్యామ్ ప్రసాద్, జేఈ సంపన్, చైర్మన్ కోట హనుమంతరావు ఉన్నారు.

అవగాహనతోనే 'ఎయిడ్స్' అంతం



ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పూర్తి అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా అంతం చేయవచ్చని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా సమకూర్చిన రూ.లక్ష విలువైన పౌష్టికాహార కిట్లను కలెక్టర్ శుక్లా ఆ వ్యాధి బాధితులకు అందజేశారు. స్థానిక కొంకాపల్లిలోని కలెక్టర్ బంగ్లా వద్ద శుక్రవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. లయన్స్ 316 బి డిస్ట్రిక్ట్ గవర్నర్ వేలూరి సూర్యానారాయణ, జోన్ చైర్మన్ జంపన సుమన్ వర్మ, ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధి నడింపల్లి వెంకట రామరాజు, లయన్స్ జిల్లా ప్రతినిధి అనిల్‌కుమార్ జైన్ పాల్గొని ఎయిడ్స్ నియంత్రణకు లయన్స్ చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం లయన్స్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూలు సెంటరు నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..

ఎయిడ్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చేపట్టిన అవగాహన ర్యాలీని కలెక్టర్ హిమాన్షు శుక్లా, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాయిరాజ్ సాత్విక్‌లు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది.

ర్యాలీని ప్రారంభించిన ఆర్డీవో కేశవవర్ధనరెడ్డి

స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర ఆధ్వర్యంలో జరిగిన ఎయిడ్స్ అవగాహన ర్యాలీని ఆర్డీవో జి.కేశవ వర్ధనరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి డాక్టర్ భారత లక్ష్మి, ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీ నల్ల వంతెన రోడ్డులో సాగింది.

పకడ్బందీగా ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్ష

డీఈవో కమలకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

ముమ్మిడివరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ అర్హత పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి పిలుపునిచ్చారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఎన్ఎంఎస్ పరీక్షకు నియమించిన సీఎస్, డీవో, మండల విద్యాశాఖాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పది పరీక్షల మాదిరిగానే ఎన్ఎంఎంఎస్ పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లకు అవకాశం ఉండరాదన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ నక్కా సురేష్ మాట్లాడుతూ అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కేంద్రాల పరిధిలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఎంఈవో అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొజ్జా రమణశ్రీ, డీసీఈబీ మెంబరు బీవీ కామేశ్వరరావు అవగాహన కల్పించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులతో ప్రస్తుతం అమలవుతున్న విద్యాపరమైన అంశాలపై డీఈవో కమలకుమారి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రామచంద్రపురం డీవైఈవో నరసింహ ఫణి, డీఈవో కార్యాలయ ఏడీ విజయలక్ష్మి, సూపరింటిండెంట్ భాను, డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు, జిల్లాలోని ఎంఈవోలు పాల్గొన్నారు.

సామాజిక సేవలో రిలయన్స్‌కు పురస్కారం



విజయవాడలో పురస్కారాన్ని అందుకుంటున్న రిలయన్స్ సీఎస్ఆర్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం

తాళ్లరేవు: కోస్తా తీరంలో భారీ ముడిచమురు ఉత్పత్తి సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీ (గాడిమొగ) తన సామాజిక సేవకుగానూ రాష్ట్రర స్థాయి పురస్కారం లభించింది. దశాబ్దకాలంగా రిలయన్స్ సంస్థ విద్య, ఆరోగ్యం విభాగాలలో ఎనలేని సేవలను అందించడం, గర్భిణులు, రోగులకు పౌష్టికాహారం అందించడం, జిల్లాలో హెచ్ఐవీ ఎయిడ్స్ నిర్మూలనకు చేసిన కృషి తదితర సేవలకు సంబంధించి ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని విజయవాడలో జరిగిన ఏపీఎస్ఏ సీఎస్ బీవీ రాజేంద్రకుమార్ చేతుల మీదుగా రిలయన్స్ సీఎస్ఆర్ ప్రతినిధి పోలాప్రగడ సుబ్రహ్మణ్యం అందుకున్నారు.

రత్నగిరిపై నగదు ఇబ్బందులు

- డిజిటల్ పేమెంట్లకు నో ఛాన్స్
- తెలియక భక్తులు లబోదిబో
- ప్రతీ కొనుగోలుకు నగదు చెల్లించాల్సిందే
- ఉన్న రెండు ఏటీఎంలూ తొలగింపు
- పునరుద్ధరించాలని అభ్యర్థన

- తూర్పు గోదావరి జిల్లా బొమ్మూరుకు చెందిన సుధాకర్ దంపతులు అన్నవరం దర్శనానికి వచ్చారు. అన్ని చోట్లా డిజిటల్ పేమెంట్లు ఉన్నాయనే భావనతో వారు వెంట ఏ మాత్రం నగదు తెచ్చుకోలేదు. దర్శనం టికెట్ మొదలుకుని ప్రసాదం కొనేవరకూ చాలా అవస్థలు పడ్డారు. దీంతో ఒక పూట అనవసరంగా ఉండాల్సి వచ్చింది.

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వై.రామకృష్ణ తన కుటుంబ సభ్యులతో అన్నవరం వచ్చారు. ఫోన్ పే సౌకర్యాన్ని కొండమీద అనుమతించకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డారు. వేరొకరిని బతిమలాడి ఫోన్ పే ద్వారా అమౌంట్ వేసి నగదు తీసుకుని దర్శనం చేసుకోవాల్సి వచ్చింది. ఈలోగా చాలా మానసిక ఒత్తిడికి లోనయ్యారు.

అన్నవరం: ఇప్పుడు అన్ని చోట్లా డిజిటల్ పేమెంట్లు జరుగుతున్నాయి. చాలామంది నగదు జేబులో పెట్టుకోవడం మానేశారు. టీ దగ్గర నుంచి జామకాయల వ్యాపారి వరకూ అందరూ ఫోన్ పే ద్వారా డబ్బులు తీసుకుంటున్నారు. తేగలు అమ్మే వారూ ఫోన్ పే సౌకర్యం పెట్టుకుంటున్నారు. లేకపోతే వ్యాపారంలో నష్టపోతామని అర్థం చేసుకున్నారు. ఎక్కడా చూసినా డిజిటల్ చెల్లింపులే. కానీ నిత్యం వేలాది మంది భక్తులతో కిటకిటలాడే ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మాత్రం డిజిటల్ పేమెంట్లకు అవకాశం లేదు. దీంతో కొండకు వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ఏ కౌంటర్లోనూ డిజిటల్ లేదు

రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో స్వామివారి వ్రతం, దర్శనం, ప్రసాదం టిక్కెట్ల కొనుగోలుకు, వసతి గదుల రుసుం చెల్లించేందుకు నగదు చెల్లించాలనేసరికి భక్తులు విస్తుపోతున్నారు. ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే, తదితర డిజిటల్ చెల్లింపులు చేసేందుకు ఇక్కడ సౌకర్యం కల్పించలేదు. ఈ విషయం తెలియని భక్తులు తక్కువ నగదుతో దేవస్థానానికి వచ్చి సరిపోక నరకయాతన పడుతున్నారు. ప్రతీ చెల్లింపునకు నగదు ఇవ్వాల్సి ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రెడిట్, డెబిట్ కార్డులను కూడా అంగీకరించడం లేదు. పోనీ నగదు విత్‌డ్రా చేద్దామన్నా వీలు లేకుండా పోయింది. భవనాల కూల్చివేతలో రెండు ఏటీఎంలనూ తొలగించారు. వాటిని దేవస్థానంలో ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఉన్న ఒక్క ఏటీఎంలో బ్యాంక్ సిబ్బంది నగదు నింపిన కొద్ది సమయానికే ఖాళీ అయిపోతోంది. కొందరు కొండ దిగువకు వచ్చి డబ్బులు తీసుకోవాల్సి వస్తోందని కాకినాడకు చెందిన రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు.



వ్రతాల టిక్కెట్లు కోసం క్యూ లో నిల్చున్న భక్తులు (ఫైల్)



అన్నవరం దేవస్థానం

రోజూ ఆదాయం

- రత్నగిరికి రోజూ సుమారు పది వేల నుంచి 50 వేల మంది వరకు భక్తులు వస్తారు. పర్వదినాలలో సంఖ్య లక్ష కూడా దాటుతుంది. భక్తుల ద్వారా దేవస్థానానికి ఆదాయం కూడా రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు, పర్వదినాలలో రూ. కోటి వరకు కూడా ఉంటుంది. అంతా కూడా నగదు రూపమే కావడంతో లెక్కింపు కూడా సిబ్బందికి ఇబ్బందిగా మారుతోంది.
- దేవస్థానంలోని ప్రతీ కౌంటర్‌లో కూడా నగదు చెల్లించాల్సిన పరిస్థితి ఉండడంతో భక్తులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. అదే సమయంలో కొండమీద ప్రైవేట్ షాపులు, క్యాంటీన్ నిర్వాహకులు డిజిటల్ పేమెంట్స్‌ను అంగీకరిస్తున్నారు. దీంతో భక్తులు వారిని నగదు ఇవ్వండి ఫోన్ పే ద్వారా పంపిస్తామని బతిమాలాడుకుంటున్నారు.

రెండు ఏటీఎంల తొలగింపు

- దేవస్థానంలో స్టేట్‌బ్యాంక్ ఏటీఎం 30 వీఐపీ సత్రంలో ఉండేది. ఈఓ కార్యాలయం ఎదురుగా పార్కింగ్ స్థలంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో, అన్నదాన భవనంపై భాగంలో యూనియన్ బ్యాంక్ (ఆంధ్రా బ్యాంక్) ఏటీఎంలు ఉండేవి. 30 వీఐపీ సత్రం, ఈఓ కార్యాలయం ఎదురుగా గల పార్కింగ్ స్థలంలో గల షాపింగ్ కాంప్లెక్స్‌ను మూడు నెలల క్రితం కూల్చేశారు. అప్పుడు వాటిలోని ఏటీఎం మెషీన్లను మరో చోటకు తరలించారు. కానీ ఎక్కడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఒక్క ఏటీఎం మాత్రమే పని చేస్తోంది.
- డిజిటల్ పేమెంట్లకు అనుమతించాలని, రెండు ఏటీఎంలను మరోచోట పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు.

షాపు కేటాయిస్తే ఏర్పాటు చేస్తాం



ఏటీఎంను మరో ప్రదేశంలో ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని దేవస్థానం అధికారులను కోరుతున్నాం. ప్రస్తుత ఈఓ రామచంద్రమోహన్ మా వినతికి స్పందించారు. పశ్చిమ రాజగోపురం ఎదురుగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపు కేటాయిస్తామన్నారు. ఆ షాపు కేటాయించిన వెంటనే ఏటీఎం ఏర్పాటు చేస్తాం.

– రఘురామ్, స్టేట్ బ్యాంక్ మేనేజర్

విద్యతోనే అభివృద్ధి



వన్నెచింతలపూడిలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన మంత్రి విశ్వరూప్

మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ప్రతి ఒక్కరు ఉన్నత విద్యను చదివితే అభివృద్ధి అనేది సాధ్యపడుతుందని, ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యాప్తికి ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. శుక్రవారం నవరపాలెం, వన్నె చింతలపూడి గ్రామాలలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత నవరపాలెంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం వన్నె చింతలపూడి గ్రామంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులైన రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన ,జగనన్న వసతి దీవెన, అమ్మ ఒడి, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ వంటి విప్లవాత్మకమైన సంస్కరణలను విద్యారంగంలో తీసుకువచ్చిందన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగపరుచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ దంగేటి డోలమణి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కరేళ్ల రమేష్, సర్పంచులు సత్తి నాగేశ్వరమ్మ, నక్క కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యులు పరమట నాగమణి, ఉదుం రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవింద్ శెట్టి, జిల్లా కార్యదర్శి జంపన రమేష్‌రాజు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేల ఉపకార వేతనం
- ప్రవేశ పరీక్షకు సన్నద్ధమైన 10,233 మంది విద్యార్థులు
- రేపు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష


ప్రవేశ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

రాయవరం: ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలు అందిస్తోంది. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పేరుతో ఏటా ప్రతిభ చూపిన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు (తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు) ఆర్థిక సాయం అందిస్తోంది. నెలకు రూ.1,000 వంతున ఏడాదికి రూ.12వేలు ఉపకార వేతనం ఇస్తోంది. ఇందుకు ఏటా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఆదివారం ఈ ప్రవేశ పరీక్షను నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ సమాయత్తమవుతోంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షను నిర్వహించనున్నారు.

సన్నద్ధమవుతున్న విద్యార్థులు

ఈ ఏడాది ఉమ్మడి జిల్లా పరిధిలో 10,233 మంది ప్రవేశ పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పాఠ్యాంశాల్లో శిక్షణ ఇస్తూ పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ప్రశ్నపత్రం ఇలా..

ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష 180 మార్కులకు ఉంటుంది. ఇందులో 90 మార్కులకు రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిష్ ఉండగా, మరో 90 మార్కులకు ఏడు, ఎనిమిదవ తరగతి గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలపై ప్రశ్నలుంటాయి.

మొదటి పేపరులో..

మెంటల్ ఎబిలిటీ (వెర్బల్ నాన్ వెర్బల్) పేపరు 90 మార్కులకు ఉంటుంది. నంబర్ సిరీస్ 10, సింపుల్ అర్థమెటిక్ 10, మిస్సింగ్ క్యారెక్టర్స్ 10, వర్డ్ ఎనాలజీ 10, లెటర్ సిరీస్ 10 మార్కులు ఉంటాయి. నాన్ వెర్బల్ నుంచి 40 మార్కులకు ఉంటాయి.

రెండవ పేపరులో ఏడవ తరగతి కీలకం

రెండో పేపరు కూడా 90 మార్కులకు ఉంటుంది. ఇందులో గణితం 20 మార్కులు, సైన్స్‌లో పీఎస్‌కు 10, కెమిస్ట్రీ 10, బయాలజీ 10, సోషల్ సబ్జెక్టులో భూగోళం 10, చరిత్ర 10, పౌరశాస్త్రం 10, అర్థశాస్త్రం నుంచి 10 మార్కులుంటాయి. ఏడవ తరగతి పూర్తిగా, 8వ తరగతి నవంబరు సిలబస్ వరకు చదివి ఉండాలి. కొన్ని జనరలైజ్డ్ బిట్స్, సబ్జెక్టు మీద, అదనపు సమాచారం, కరెంట్ ఎఫైర్స్‌పై కూడా తగిన జ్ఞానం కలిగి ఉండాలి. 180 నిమిషాల్లో 180 బిట్స్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. పేపర్-1లో సమయాన్ని సద్వినియోగం చేసుకుని వేగంగా సమాధానాలు రాసి, అక్కడ మిగిలిన సమయాన్ని పేపర్-2లో గణితానికి వినియోగించుకుంటే విజయం సాధించడం సులభమని నిపుణులు చెబుతున్నారు. ఒక ప్రశ్నకు ఒక నిమిషం సమయం మాత్రమే ఉంటుంది. ప్రశ్నపత్రంలో 60 మార్కులు సులభంగా, 60 మార్కులు మధ్యస్థంగా, 60 మార్కులు కఠినంగా ఇచ్చే అవకాశముంది. సులభమైన ప్రశ్నలతో పాటు, మధ్యస్థంగా ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాబడితే విజయం తథ్యమవుతుంది. కనీసం 130 మార్కులు దాటిన వారికి విజయావకాశాలు ఉంటాయి. ప్రశ్నకు ఇచ్చిన నాలుగు సమాధానాల్లో సరైన దానిని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే బబ్లింగ్ చేయాలి. ఏ ప్రశ్నకు ఆ ప్రశ్నకు సంబంధించిన సమాధానానికి నంబరు ఎదురుగా బబ్లింగ్ చేయాల్సి ఉంటుంది. ఓఎంఆర్ షీటు మీద అదనంగా ఏమీ రాయకూడదు.

ఇదీ లెక్క...

జిల్లా	పరీక్షా కేంద్రాలు	విద్యార్థులు
కోనసీమ	15	3,121
కాకినాడ	15	4,170
తూర్పుగోదావరి	13	2,942
మొత్తం	43	10,233

అదనపు తరగతులు

రోజూ పాఠశాలలో అదనపు తరగతిని నిర్వహించి ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నారు. నాలుగు నెలలుగా పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రిపేర్ అవుతున్నాం. కచ్చితంగా విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది.

– బి.సంతోషిణి, 8వ తరగతి విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్, వెంటూరు, రాయవరం మండలం

ఏటా శిక్షణ

పదేళ్లుగా ఏటా విద్యార్థులను ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు సన్నద్ధం చేస్తున్నాం. గతేడాది మా పాఠశాలలో 10 మంది ఎంపికయ్యారు. ఈ ఏడాది కూడా రోజూ అదనపు తరగతులు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు శిక్షణనిచ్చాం.

– విత్తనాల సుబ్బారావు, మున్సిపల్ హైస్కూల్ రత్నంపేట, రామచంద్రపురం

సీఎస్, డీవోల నియామకం పూర్తి

ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు సీఎస్, డీవోల నియామకం పూర్తి చేశాం. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం.

– నక్కా సురేష్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, కోనసీమ జిల్లా

ఏర్పాట్లు పూర్తి

ప్రవేశ పరీక్షకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాల వారీగా నిర్దేశించిన పరీక్షా కేంద్రాల పరిధిలో పేపర్లను ఆయా పోలీస్ స్టేషన్లలో భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేశారు. కోనసీమ జిల్లా పరిధిలో రామచంద్రపురం, కొత్తపేట డివిజన్ కేంద్రాల్లో నాలుగేసి, అమలాపురం డివిజన్‌లో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లాలో కాకినాడ డివిజన్ కేంద్రంలో ఎనిమిది, పెద్దాపురం డివిజన్ కేంద్రంలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేయగా తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కొవ్వూరు డివిజన్‌లో నాలుగు, రాజమహేంద్రవరం డివిజన్ కేంద్రంలో తొమ్మిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పాము కాటుకు బాలుడి మృతి


మృతుడు లోహిత్

కాట్రేనికోన: పల్లంకుర్రు శివారు కొత్త ఆదియాంధ్రపేటకు చెందిన బాలుడు జగడం లోహిత్ (2) పాము కాటుకు గురై మృతి చెందాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. జగడం లోవకిరణ్, కాంచన దంపతులకు ఏకైక కుమారుడు లోహిత్. శుక్రవారం ఆ బాలుడు ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో స్పృహతప్పి పడిపోయాడు. ఏం జరిగిందో తెలియక తల్లిదండ్రులు పరిశీలించగా చేతిపై పాముకాటు ఉండడాన్ని గమనించి కాట్రేనికోన ప్రాథమిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న లోహిత్‌కు వైద్యులు సేవలు అందించినా పరిస్థితి విషమించడంతో 108 అంబులెన్సులో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతను అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు.

రసరమ్యంగా 'భక్త రామదాసు' సంకీర్తన


భక్త రామదాసు సంకీర్తనలను ఆలపిస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: భూపయ్య అగ్రహారంలోని రామచంద్రస్వామి దేవస్థానం పునర్వసు మండపంలో అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు సొసైటీ, ఆర్ట్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో శ్రీగణపతి సచ్చిదానందస్వామి భజనలు, అన్నమయ్య, రామదాసు సంకీర్తలపై వర్క్‌షాపు శుక్రవారం జరిగింది. శ్రీభక్త రామదాసు అష్టోత్తర శత సంకీర్తనార్చన సాగింది. భక్త రామదాసు రచించిన 108 సంకీర్తలను మహిళలు ఆలపించారు. మృదంగ సహకారం పేరి రఘు, వయొలిన్ సహకారం పి.గణపతి అందించారు. ఆర్ట్ ఫ్యామిలీ అధ్యక్షురాలు తాతపూడి సౌమ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలు పేరి సత్యవాణి, కార్యదర్శి కొత్తూరి బాల, కోశాధికారి ఆండ్ర ఉషారాణితో కూడిన బృందం సంకీర్తనలను రసరమ్యంగా ఆలపించారు. ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, సంస్కార భారతి ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి పాల్గొన్నారు. సాయంత్రం వరకూ సాగిన ఈ సంకీర్తనార్చనలో ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులు శ్రీనిత్య, పద్మావతి, ప్రియాంక, లక్ష్మి, లక్ష్మీనరసింహం, శిష్టాలక్ష్మి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతుడు రాజేష్

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లికి చెందిన కెల్లా రాజేష్(26)మృతి చెంది ఉండటాన్ని నల్లజర్ల పోలీసులు కనుగొన్నారు. ఎస్ఐ నరసింహమూర్తి అందించిన వివరాల ప్రకారం అనంతపల్లికి చెందిన కెల్లా శ్రీనివాస్, పార్వతిల పెద్దకుమారుడు రాజేష్ పదిరోజులుగా కనపడటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటర్ వరకు చదువుకున్న రాజేష్ నిలకడ లేక దురలవాట్లకు బానిసయ్యాడని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసుల సూచనల మేరకు పలు ప్రాంతాలలో రాజేష్ ఆచూకీ కోసం గాలిస్తుండగా పోలవరం కుడికాలువలో అచ్చన్నపాలెం వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉంది. మృతదేహాన్ని చేపలు తినడంతో బాగాపాడై ఉంది. కుటుంబ సభ్యులు అతడు వేసుకున్న దుస్తుల ఆధారంగా గుర్తించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పిఠాపురంలో...

పిఠాపురం: పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్న ఒక వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు కనుగొన్నారు. పోలీసుల కథనం ప్రకారం పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో సాయిబాబా గుడి సమీపంలో నివాసముంటున్న నల్లాడ లక్ష్మణరావు అలియాస్ రాంబాబు ఇంట్లో మృతి చెంది ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి అశ్వనితో వివాహం కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యతో మనస్పర్థల కారణంగా ఐదేళ్ల క్రితమే విడాకులు తీసుకున్నారు. ఇద్దరు పిల్లలతో భార్య కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని పెడనలో ఉంటోంది. లక్ష్మణరావు ఒంటరిగా ఇక్కడ ఉంటూ పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడు. అతను ఐదు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు


నూతిలోకి దూకిన వెంకటలక్ష్మి


వెంకటలక్ష్మిని రక్షిస్తున్న పోలీసులు, స్థానికులు


వెంకటలక్ష్మికి, దొరబాబుకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై స్వామినాయుడు

కొత్తపల్లి: భర్త తిట్టాడనే కోపంతో ఒక వివాహిత నూతిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుతుకుడుమిల్లి పోస్టు ఆఫీసు ఎదురుగా అద్దెకు ఉంటున్న కాకాడ వెంకటలక్ష్మి భర్త దొరబాబు తిట్టాడనే కోపంతో శుక్రవారం మధ్యాహ్నం నూతిలోకి దూకింది. దీంతో స్థానికులు కొత్తపల్లి పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో చేరుకుని నూతిలోకి దూకిన ఆమెను స్థానికుల సహాయంతో రక్షించారు. అనంతరం వెంకటలక్ష్మి, దొరబాబుకు కౌన్సెలింగ్ ఇచ్చి, మందలించి విడిచిపెట్టారు.

ర్యాంకింగ్ పెంపునకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య రామ్మోహనరావు

రాజానగరం: రాష్ట్రంలో విద్యా, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని నాణ్యత హామీ విభాగం అకడమిక్ అధికారి జి. శ్రీరంగంమాధ్యూ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నాణ్యత హామీ విభాగం, ఏపీ ఉన్నత విద్యా మండలి సంయుక్త ఆధ్వర్యంలో 'నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ 2024' అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ జరిగింది. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో ఉన్న కళాశాలల ఐక్యూఏసీ డైరెక్టర్లతో ఈ విధంగా వర్క్‌షాపులు నిర్వహిస్తూ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఇది భవిష్యత్తులో ప్రతి విద్యా సంస్థకు ముఖ్యమన్నారు. నాణ్యత హామీ విభాగం డైరెక్టర్ ఆచార్య కె.రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యాసంస్థలు నాక్ గుర్తింపుతోపాటు ర్యాంకింగ్ పై కూడా దృష్టిని పెట్టాలన్నారు. దీనివలన విద్యా సంస్థల మధ్య పోటీ పెరుగుతుందని, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యాసంస్థలు తయారవుతాయన్నారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ యూనివర్సిటీలో ర్యాంకింగ్‌ని పెంచే విధంగా ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నామని వివరించారు. గ్లోబలైజేషన్‌కి అనుగుణంగా వివిధ కోర్సులను అమలు చేయడంతోపాటు వివిధ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, రీసోర్స్‌పర్సన్ డాక్టర్ ఆర్. రవీంద్రన్ (చెన్నై), వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 163 మంది ఐక్యూఏసీ కోఆర్డినేటర్స్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రో కబడ్డీ రిఫరీగా మురళీకుమార్

– నేటి నుంచి మ్యాచ్‌లు



సామర్లకోట: కబడ్డీ క్రీడాకారుడు, ఫిజికల్ డైరెక్టర్ బోగిళ్ల మురళీకుమార్ ప్రో కబడ్డీ పదో సీజన్‌కు రిఫరీగా ఎంపికయ్యారు. క్రికెట్ తర్వాత ఎక్కువ మంది ప్రో కబడ్డీని తిలకిస్తున్నారు. అహ్మదాబాద్, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, గ్రేటర్ నోయిడా (ఉత్తరప్రదేశ్), పంచకుల (ఛండీఘడ్), ఢిల్లీ, కోల్‌కతా, పాట్నా, జైపూర్, పుణేల్లో శనివారం నుంచి ప్రోకబడ్డీ లీగ్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. ఈ మ్యాచ్‌లకు మురళీకుమార్ రిఫరీగా వ్యవహరిస్తారు. శనివారం నుంచి ప్రోకబడ్డీ మ్యాచ్ గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ప్రారంభమవుతుందని మురళీకుమార్ స్థానిక విలేకర్లకు తెలిపారు. గతేడాది జాతీయ స్థాయి మహిళా కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌కు రిఫరీగా కూడా మురళీకుమార్ వ్యవహరించారు. రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక రిఫరీ ఈయన కావడం విశేషం. ప్రస్తుతం మురళీకుమార్ జగ్గంపేట జెడ్పీ హైస్కూల్‌లో పీడీగా పని చేస్తున్నారు. ఈయన ఇప్పటి వరకు ఏడు పర్యాయాలు ప్రోకబడ్డీ రిఫరీగా వ్యవహరించారు. ప్రోకబడ్డీ రిఫరీగా ఎంపికైన మురళీకుమార్‌ను ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసు, రాష్ట్ర కోచ్ పోతుల సాయిప్రసాద్ అభినందించారు.

సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు రేపు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నారు. డీఎస్ఏ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ టెన్నిస్ మైదానంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్వీ సాయిబాబు, వి.అఖిల శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 9, 10 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్, రాష్ట్ర జట్ల ఎంపికల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి వి.నీలిమకు రిపోర్ట్ చేయాలని కోరారు.

షూటింగ్ బాల్ బాలబాలికల జట్ల ఎంపిక రేపు

రావులపాలెం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-19 జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపికలు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తారని సెక్రటరీ బి.సతీష్‌బాబు శుక్రవారం తెలిపారు. 01-01-2005 తర్వాత జన్మించినవారు అర్హులని, ఎంపికకు వచ్చే క్రీడాకారులు వారి వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8, 9, 10 తేదీలలో గుంటూరు జిల్లా మార్టూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 80081 51026, 93978 56767 ఈ నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు రాష్ట్ర టీ 20 క్రికెట్ జట్ల ఎంపిక

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం సిటీ : ఏపీ రాష్ట్ర టీ 20 క్రికెట్ జట్ల ఎంపిక ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రాజమహేంద్రవరంలోని సెంచురియన్ క్రికెట్ ఆకాడమీలో నిర్వహిస్తున్నట్లు ట్వంటీ ట్వంటీ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో విజయం సాధించిన జట్టు గోవాలో జరిగే టీ 20 క్రికెట్ నేషనల్ క్యాష్ ప్రైజ్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటుందని చెప్పారు. ఎంపికలకు క్రీడాకారులు వైట్ అండ్ వైట్ డ్రస్, షూస్, క్రికెట్ కిట్‌లతో రావాలన్నారు.